**3వ పాఠం** **ఏప్రిల్ 11-17**

# గర్వముతో వచ్చే సమస్య

**సబ్బాతు మధ్యాహ్నము** **ఏప్రిల్ 11**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : 1యోహాను 2:15-17; లూకా 18:9-14; హెబ్రీ 11:24-26; లూకా 22:24-27; ఫిలిప్పీ 2:3-8.**

**కంఠతవచనం : "తన్ను తాను హెచ్చించుకొను ప్రతివాడును తగ్గింపబడును. తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడునని చెప్పెను" (లూకా 14:11).**

కొంతమంది మనుష్యులు ఎల్లప్పుడు నీతిగా వ్యవహరిస్తారు. అన్ని విషయాలలో న్యాయముగా మసలు కుంటారని అనుకుంటారు. మరికొందరైతే వారి హద్దులలోనే ఉండేవారుంటారు. అలా హద్దులలో ఉండే వ్యక్తి ఎటువంటి సహాయము అంగీకరించకపోవచ్చు. కొందరైతే ప్రతి చిన్న విషయానికి ఇతరులతో తగవు పెట్టుకొందురు. అవమానకరమైన మాటలతో బాధిస్తారు. ఇట్టి చెడు ప్రవర్తన కలిగిన అనేకమంది వ్యక్తులను గురించి మనము ఆలోచిస్తూ యుండవచ్చు. అయితే యధార్ధమైన ప్రశ్న ఏమిటంటే "నా గురించి ఏమిటి?" ఇతరుల హృదయములో ఉన్న గర్వమును బట్టి నిందిస్తూ మన సమయాన్ని వృధా చేయుచు గడుపుతాము. అయితే అదే సమయములో మనలో దాగియున్న గర్వమును చూడలేకపోవచ్చును.

గర్వముతో నిండిన హృదయమునకు వ్యతిరేకముగా మనమందరము పోరాడితిమి. మన చుట్టూ ఉన్న ప్రజలకన్నా మిన్నగా కనిపించాలని, ప్రవర్తించాలని లేక మంచిగా మాట్లాడాలని అందరికి ఆశ ఉంటుంది. కొన్ని విషయాలలో ఇతరులకంటే మంచిగా ఉన్నామనుకుంటాము. మన జీవితాలకు గొప్ప విలువ వున్నదని ఇతర ప్రజలకు చూపించాలనే కోరిక మన హృదయాలలో ఉన్నందున, ఆ కోరికలో నుండే గర్వము పుట్టుకొస్తుందని ఒకరు చెప్పారు. అయితే దేవుడు మనలను నిర్మించుటవలనను, మన కొరకు మరణించుట వలనను ఇప్పటికే మన జీవితాలకు విలువ ఉన్నదని అందరికి తెలుసు.

ఈ వారం మనము గర్వముతో వచ్చే సమస్యను గూర్చి అధ్యయనము చేయబోతున్నాము. ఇతర ప్రజలతోను, దేవునితోను మనకున్న బాంధవ్యము గర్వము వలన ఏవిధంగా గాయపరచబడుతుంది. గర్వము లేని హృదయము గల్గియుండుటను గూర్చి బైబిలు ఏమి బోధిస్తుంది?

– ఏప్రిల్ 18, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుదము.

ఆదివారం ఏప్రిల్ 12

**గర్వము వలన ఎదురయ్యే ప్రమాదములు (1యోహాను 2:15-17)**

గర్వము. గర్వము అనే ఈ పదమును గురించి నీవు ఆలోచించినప్పుడు నీ మనస్సులో ఎటువంటి తరహా చిత్రము రూపుదిద్దుకుంటుంది? నీవు ఒక ప్రభుత్వ నాయకుని చూస్తావా? ధనవంతుడు లేక గొప్ప పేరు కలిగిన వ్యక్తిని ఊహించుకుంటావా? ఒక నెమలిని చూస్తావా? నీ హృదయములో గర్వముతో కూడిన భావములు నిండుకొని యున్నపుడు నీవు చాలా ముఖ్యమైన వ్యక్తిననే భావము నీలో కలుగుతుంది లేక ఇతరులకన్నా నీవు అనేక విషయాలలో యోగ్యుడవనే భావన నీలో ఏర్పడవచ్చును. నిజానికి గర్వము అనేది మనము నమ్మకూడని ఒక భావము.

గర్వము అనేది మొదటగా లూసీఫరుతో ఆరంభమైంది. లూసిఫరును ఉద్దేశించి దేవుడు ఈ విధంగా ప్రకటించెను. అభిషేకము నొందిన కెరూబువై యొక ఆశ్రయముగా నీవుంటివి. అందుకే నేను నిన్ను నియమించితిని? (యెహెజ్కేలు 28:14) పరలోకములో లూసిఫరు దేవునితో బహు సన్నిహితముగా పనిచేసెను. లూసిఫరు హృదయములో ఎప్పుడు ఏవిధముగా స్వార్ధము కొరకు పనిచేయాలనే తలంపులు కలిగినవో మనకు తెలియదు. అయితే ఈ స్వార్ధపు తలంపులు పరలోకములో యుద్దము సంభవించుటకు కారణమైనట్లు మనకు తెలుసు. ఈ యుద్ధమునే ప్రపంచ వ్యాప్తముగా మంచికిని మరియు చెడుకును మధ్య జరుగుచున్న యుద్ధముగా పిలువబడుచున్నది. లూసిఫరు దేవుని యొక్క విరోధిగాను సాతానుగాను పిలువబడుచున్నాడు. దేవుని నుండి పూర్తిగా వేరైపోయినవాడు సాతానుడు. (యెషయా 14:12-14 మరియు ఫిలిప్పి 2:5-11 పోల్చి చదువుడి) సాతానుడు ఆదామవ్వలు దేవునిని శంకించే విధముగా చేసెను. స్వప్రయోజనమును ప్రేమించి వారియందు వారే నమ్ముకొని జీవించే విధముగా వారి తలంపులను మార్చివేసెను. అప్పటినుండి ఈ భూమి మీద పాపమునకు వ్యతిరేకముగా పోరాటము చేయుచున్నాము.

**1యోహాను 2:15-17 చదువుడి. ఈ లోక సంబంధమైన జీవితమును ప్రేమించే విషయమును గురించి మరియు గర్వమును గూర్చి ఏ మూడు బైబిలు సత్యాలను ఈ వాక్యములు మనకు బోధించుచున్నవి?**

..........................................................................................

గర్వముతో కూడిన భావము కలిగియుండుట మంచిదేనా? ఏవో ఒక విషయములో ఎవరో ఒకరు చాలా చక్కగా పనిచేసారని వారిని గూర్చి మాట్లాడినప్పుడు ఆ పదమును ఉపయోగిస్తే అది మంచి విషయముగానే అనిపిస్తుంది. అప్పుడు వారిని మనము "నిన్ను గూర్చి గర్విస్తున్నాను" అని చెప్పవచ్చును. దేవుడు ప్రతి మనిషికి కొన్ని తలాంతులు, నైపుణ్యతలు, కొన్ని వరములను అనుగ్రహిస్తాడు. ఆ ప్రత్యేకమైన నైపుణ్యతలను మానవ శ్రేయస్సు కొరకు ఉపయోగించినపుడు, మనమేదో గర్వముతో నిండియున్నామని అర్ధము

కాదు. ఎవరైనా ఒకరు తన యొక్క క్షేమాభివృద్ధి కొరకు తనను తాను ప్రేమించుకొనుట మంచిదే అని బైబిలు మాట్లాడుచున్నది. ఈ విషయములో యేసు ఇచ్చిన ఆజ్ఞను గురించి మార్కు 12:31 చదువుడి. ఈ వాక్యములో యేసు “నీవు నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను” అని మనకు బోధించాడు. అయితే యేసు మాట్లాడుచున్న ప్రేమ స్వార్ధపూరితమైన ప్రేమ కాదు. ప్రజల హృదయాలలో దేవుడు నివసించినపుడు గర్వముండదు. అట్టివారు దేవుని కొరకు జీవిస్తారు. (1తిమోతి 3:1) దేవుని మేలు మరచి ఆయనను స్తుతించకుండా జనులు గర్వముతో నింపబడుదురు.

దేవుని దృష్టిలో మన క్రియలు, ఆస్తి విలువను పెంచేవి కావు. మనకు విలువ దేవుని యొద్ద నుండి రావాలి. ఈ సత్యమును జ్ఞాపకముంచుకోవాలి (1దిన 29:14).

**నిన్ను నీవు ప్రశ్నించుకో. నా హృదయంలో ఎంత గర్వముంది. నా గర్వము దేవునితో ఇతరులతో ఉండాల్సిన బాంధవ్యమును ఎట్లు గాయపరుస్తుంది?**

సోమవారం ఏప్రిల్ 13

## నిన్ను నీవు తెలుసుకో (లూకా 18:9-14)

ఇద్దరు మనుష్యులు ప్రార్థించుటకు దేవాలయమునకు వెళ్ళిరి. ఒక మనుష్యుడు క్రైస్తవ సంఘ నాయకుడు. అతనిని అందరూ గౌరవిస్తున్నారు. సంఘ కార్యక్రమములు ఆరంభము కాకముందే ఆ నాయకుడు ముందు వరుసలో నిలువబడి ప్రార్థించుట మొదలుపెట్టాడు. అతడు ప్రార్థించుచుండగా అందరు అతనిని గమనిస్తున్నారు. అతనిని మంచి మనిషిగా చేసినందుకు ఆ నాయకుడు ముందుగా దేవునికి స్తుతులు చెల్లించాడు. అదే సమయములో దేవాలయమునకు వెళ్ళిన రెండవ వ్యక్తి కనీసము ఇల్లు లేని ఒక పేదవాడు. అతడు ఆ క్రైస్తవ దేవాలయములోని వెనుక వరుసలో నిలువబడ్డాడు. కన్నీళ్ళతో అతని కనులు నిండియున్నవి. అతడు మోకరిల్లి దీన స్వరముతో ఈ విధంగా ప్రార్థించాడు. ‘నేనొక పాపిని. నాపై కృప చూపించు ప్రభువా” అని వినయముగా ప్రార్థించెను.

**లూకా 18:9-14 చదువుడి. ఈ వాక్యములలో యేసు మాట్లాడుచున్న ఇద్దరు మనుష్యులను గూర్చి నీవేమి భావిస్తున్నావు? యేసు యొక్క ఆలోచన ఏమిటి? ఈ వాక్యాలు ఏ గుణపాఠమును బోధిస్తున్నవి?**

మనలను మనము చాలా సులువుగా పొగడుకుంటాము. కొంతమంది ప్రజలు వారు చేసే ఆశ్చర్య క్రియలను గూర్చి మాట్లాడుటకు ఆసక్తిని చూపుదురు. అయితే దేవుని దృష్టిలో అది అంత ప్రాధాన్యతతో కూడినది కావు. యేసు ఈవిధముగా పలికెను. “తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడుననియు, తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడుననియు చెప్పెను” (లూకా 18:14). భోజన బల్ల యొద్ద ప్రధానమైన స్థానములో మనము కూర్చొనకూడదు అని యేసు చెప్పాడు. భోజన బల్ల యొద్ద కూర్చొని ఆహారము తీసుకునేటప్పుడు ఇతరులకు ప్రాధాన్యతనిచ్చి ప్రాధాన్యము కాని స్థానములో కూర్చుండుట

మనకు మేలు. ఆవిధముగా ప్రవర్తిస్తే విందు అధికారి తానే స్వయముగా మనలను ప్రధానమైన చోట కూర్చొనమని ఆహ్వానిస్తాడు, తనకు ఇష్టమైతే (లూకా 14:8–10) మనము ఊహించని బోధను యేసు ఇక్కడ మనకు చేస్తున్నాడు. "నీవు పాపివి అని ముందు గ్రహిస్తేనే గాని, యేసు నిన్ను రక్షించడు" –ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు, పుట 158.

మనము పాపులమని గ్రహించినపుడు నిరీక్షణతో యేసు యొద్దకు వచ్చెదము. "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును (1యోహాను 1:9).

మనము యేసుకు సమీపముగా చేరినప్పుడు "మనము ఎవరైయున్నామని అర్ధము చేసుకొనుటకు, మనము యేసువైపు చూచి ఆయనను తెలుసుకొనవలెను. లేనియెడల మనము స్వార్థముతోను, గర్వముతోను నింపబడుదుము" –ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు, పుట 159.

గర్వముతో నిండిన హృదయములు గల ప్రజలను గూర్చి దేవుడు ఏమనుకొనుచున్నాడు? "చిన్నలారా, మీరు పెద్దలకు లోబడియుండుడి. మీరందరు ఎదుటి వాని యెడల దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును" (1పేతురు 5:5).

**దేవుని యొక్క ప్రేమను మరియు ఆయన అనుగ్రహించు క్షమాపణను చివరిగా నీవెప్పుడు అంగకరించితివి? (మనకు అనుదినము దేవుని ప్రేమ పాపక్షమాపణ అవసరమైయున్నది) ఇతర ప్రజలకు దేవుని ప్రేమను, క్షమాపణను చూపవలసి యున్నాము. తక్షణమే ప్రార్ధనలో కొంత సమయము గడిపి, నీ హృదయములో గూడుకట్టుకున్న గర్వమును తీసివేయమని దేవునిని ప్రార్థించు. నిన్ను నీవు హెచ్చించుకొని గౌరవించుకొనవద్దు. దేవుడు ఎన్నిక చేసుకొనిన సమయమందు, ఆయనే నిన్ను ఘనపరచునట్లు వేచియుండు.**

**మంగళవారం** **ఏప్రిల్ 14**

## మోషే : తన హృదయములో గర్వము లేని ఒక మనిషి (హెబ్రీ 11:24-26)

మోషే జీవించిన ఐగుప్తీయుల రాజ గృహము గొప్ప ఐశ్వర్యముతోను సంతోషముతోను, సుఖముతోను నిండియుండెను. బైబిలు ఈ విధముగా వర్ణించుచున్నది.

"మోషే ఐగుప్తీయుల సకల విద్యలను అభ్యసించి, మాటలయందును, కార్యములయందును ప్రవీణుడైయుండెను". (అపొ.కా. 7:22). అధికారము, ఐశ్వర్యము మరియు గొప్ప పేరు ప్రతిష్టలు మోషేకు అనుగ్రహింపబడెను. అయితే అతడు వీటికి బదులుగా వేరే విషయాన్ని ఎన్నిక చేసుకొనెను. మోషే ఒక చారిత్రికవేత్త. కవి, తత్వవేత్త, సైన్యాధికారి మరియు పరిపాలన చేసిన నాయకుడు. అతడు తలపెట్టిన ప్రతి పనిలోను

దివ్యమైన ఫలితములను సాధించినవాడు. అయితే ద్రవ్యమును ఖ్యాతిని నిరాకరించగలిగే బలము కలిగినవాడు మోషే. "మోషే పెద్ద వాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనముకంటె క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని అల్పకాలము పాప భోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించెను" (హెబ్రీ 11:25) ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు పుట 246.

**మోషేను గురించి హెబ్రీ 11:24-26 మనకు ఏమి చెప్పుచున్నది? దేవునిని సేవించుటకు మోషే తన హృదయమునుండి గర్వమును పూర్తిగా తొలగించుకొనుటకు ఎందుకు నిశ్చయించుకొనెను?**

మోషే ఎన్నిక చేసుకొనిన విధానము ఆశ్చర్యమును కలిగిస్తుంది. ఆ కాలములో భూమిమీదున్న శక్తివంతమైన దేశము నుండి వచ్చిన, చాలా శక్తిమంతుడైన ఒక మనిషిగా మోషే గుర్తింపబడెను. అయితే మోషే ఒక ఐగుప్తీయుని చంపెను. (నిర్గమ 2:12) అంతట మోషే తన జ్ఞానము నందును, బలమునందును ఉన్న తన నమ్మకమును పోగొట్టుకున్నాడు. తన హృదయములో ఉన్న గర్వమును పూర్తిగా ఖాళీ చేసెను. అప్పటినుండి మోషే నూతన పాఠములను నేర్చుకొనుటకు సిద్ధపడెను. దేవుని ప్రజలను బానిసత్వములో నుండి విడిపించి వారిని దేవుడు అనుగ్రహించిన వాగ్దాన దేశములోనికి నడిపించుటకు అవసరమైన అన్ని విషయాలను తెలుసుకొని నేర్చుకొనుటకు 40 సం॥ దేవుడు మోషేకు బోధించెను. పరలోకము మరియు నిత్యజీవమును గురించి దేవుడు చేసిన వాగ్దానమును ఐగుప్తులో మోషే విడిచిన విషయాలను పోల్చి చూచుటకు తగినవి కావు.

"మోషే భూమి మీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వీకుడు" (సంఖ్యా 12:3) దేవునియొక్క ప్రజలకు మోషే ప్రాముఖ్యమైన నాయకులలో ఒకడని బైబిలు సాక్ష్యమిచ్చుచున్నది. మోషే హృదయములో గనుక గర్వమున్న యెడల ఏమి సంభవించియుండెడిది? మోషే యొక్క జీవితమునకు సంబంధించిన వృత్తాంతములు ఏవిధముగా విభిన్నమైనవిగా ఉన్నవి? మండుచున్న పొద విషయము ఏమిటి? ఐగుప్తులో వచ్చిన పది తెగుళ్ళు విషయము ఏమిటి? ఎఱ్ఱ సముద్రమును ఇశ్రాయేలీయులు దాటి వెళ్ళుట, పరలోకమునుండి ఆహారము కురియుట, పది ఆజ్ఞలను ఇచ్చుట, ఇవన్నియు కూడా పరిశీలించదగిన అంశములే.

**"నీ జీవితమును గురించి ఆలోచించుకో. నీ హృదయములో గర్వము లేదని ప్రజలు నిన్ను గూర్చి చెప్పగలరని నీవు అనుకుంటున్నావా? అవును లేక లేదు. ఏదో ఒక జవాబు ఇవ్వండి. వీటిని గూర్చి తగిన వివరణ ఇవ్వండి. మన హృదయములలో నుండి గర్వమును తీసివేసుకొనుటకు యేసు యొక్క అవసరము ఎంతైనా ఉంది" నేను యేసును కలిగియుందును అనే కీర్తనను చదవండి లేక పాడండి ఎడ్వెంటిస్టు (ఇంగీషు పాట సంఖ్య 327) ఈ కీర్తన యొక్క భావము మోషే జీవితవర్తమానమును ఏవిధంగా చూపిస్తుంది? నీ సొంత జీవితమును ఆ కీర్తన ఎంతవరకు చూపిస్తుంది?**

**బుధవారం** **ఏప్రిల్ 15**

## ఘోరమైన పాపము (లూకా 22:24-27)

యేసు యొక్క 12 మంది శిష్యులలో నీవు ఒకడవు అని నీ మనసులో ఊహించుకొనుడి. యేసుతో ప్రయాణము చేసినట్లు, ఆయనతో భోజనము చేసి, ఆయనకు సమీపముగా నీవు నిద్రించియున్నట్లు ఊహించుకొనుడి. నీ జీవితముతో పాటు అనేకుల జీవితాలను ఆయన మార్చి వేసెను. యేసుతో సమయము గడపాలని ప్రజలు కోరుకున్నారు. యేసుతో సన్నిహితంగా ఉన్న ఆ 12 మంది శిష్యులలో ఒకనిగా నిన్ను ఆయన ఎన్నుకున్నందుకు నీవు ప్రత్యేకమైన వాడవనే భావన నీలో కలుగవచ్చును. అంతట నీలో ఆశ్చర్యము కలుగవచ్చును. యేసును వెంబడించిన 12 మంది శిష్యులలో నిజముగా ఎవరు గొప్పవారు లేక ఎవరు ముఖ్యులు అనే తలంపు నీలో కలుగవచ్చును.

**లూకా 22:24-27లో ప్రాధాన్యత అనగా ఏమిటో అని యేసును వెంబడించిన శిష్యులు వారిలో వారికి ఒక పోరాటము జరుగుచుండగా యేసు యొక్క జవాబును చదువుడి. ఈ వర్తమానములో యేసు ఏమి చెప్పుచున్నాడు?**

యేసుతో ఆయన శిష్యులు 12 మంది చాలా సమయము గడిపిరి. ఆయనతో వారు ఎంతో సన్నిహితముగా మెలిగిన తరువాత పై అంశమును గురించి వారు చర్చించుకొనరని మీరనుకొనవచ్చును. అయితే వారు మాత్రమే ఆ అంశమును గూర్చి చర్చించిరి.

యేసుతో గడిపిన వారి సమయమును గూర్చి 12 మంది శిష్యులు సంతృప్తిచెందలేదు. వారి హృదయములు గర్వముతో నిండియున్నవి. ప్రతి శిష్యుడు ఇతర శిష్యులకన్నా మంచివాడై యున్నాడనే తలంపు బలముగా ఉన్నది. మన తలంపులన్నియు గర్వముతో నిండుకొని యుండుట చాలా సులువైన విషయమే. అయితే అన్ని విషయాలకన్నా గర్వమును దేవుడు ఎక్కువగా అసహ్యించుకొనును. దేవుడు మాకు అవసరములేదు మరియు ఆయనలేకుండగనే మేము జీవించగలము అని తలంచేవారి విషయమై దేవుడు చాలా విచారించుచున్నాడు. ఇట్టి తలంపులు భావములు ప్రజలను భయంకరమైన ప్రమాదములోనికి నెట్టివేయును. గర్వమును నాశనము చేయుట చాలా కష్టముతో కూడిన చర్యయై యున్నందున అదొక ఘోర పాపముగా పరిగణింపబడినది – ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు, పుట 54.

అన్నిటికన్నా ముఖ్యముగా మన గర్వము దేవునికి కోపము పుట్టించును. మన హృదయములో గర్వమున్నట్లు తరచుగా గమనించకపోవుట వలన, దానిని హృదయములో నుండి తీయుట చాలా కష్టమైన పని. రక్షకుడైన ప్రభువుపై హృదయములో ఆధారపడకుండా మన మీదే ఆధారపడినపుడు చాలా లోతుగా మన హృదయములోనికి చూడము. అందుచేత మనము యదార్థముగా ఎవరిమైయున్నామో అనే విషయాన్ని చూడలేని స్థితిలో ఉంటాము. గర్వమును ఒక రాజును చూచినట్లు చూస్తాము. ఒకరాజు తన దేశమును ఏవిధముగా

తన స్వాధీనంలో ఉంచుకుంటాడో అదే రీతిగా మన హృదయములను కూడా దానిలో దాగియున్న గర్వము తన స్వాధీనములో పెట్టుకుంటుంది. ఈ పరిస్థితిని మనము నిజముగా నిలువరించి మన దీనస్థితివైపు చూచుకొనవలసిన పరిస్థితి ఉన్నది. మన నేత్రములను తెరచి పాపములను మనకు చూపించమని ప్రార్ధన చేయాలి. నేడు దేవునితో సన్నిహిత బాంధవ్యము కలిగియుండకుండా చేయునది గర్వమే మొదటిది.

మీ హృదయములలో నుండి కేవలం దేవుడు మాత్రమే గర్వమును, స్వార్ధమును తీసివేయగలడని నమ్ముచున్నావా? ఇప్పుడే ఈ క్రింద సూచించిన ప్రార్ధన చేయండి. నా ప్రభువైన దేవా! నా హృదయమును నీ వశమున పెట్టుకో. నేను దానిని నీకివ్వలేను. అది నీ సొత్తు. నా హృదయమును శుభ్రపర్చుము. దానిని శుభ్రపర్చలేను. బలహీనుడను. నన్ను రక్షింపుము. నేను యేసును పోలియుండాలని కోరుచున్నాను. నన్ను పవిత్రపర్చి ప్రేమతో నింపుము" –ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు పుట 159.

**గురువారం** **ఏప్రిల్ 16**

## యేసువైపు చూడుడి (లూకా 22:27)

**లూకా 22:27 మరొకసారి చదవండి. యేసును వెంబడించే ప్రతి వారికి ఈ వాక్యాలలో ఇవ్వబడిన ప్రాముఖ్యమైన వర్తమానము ఏమిటి?**

..............................................................................................................

దేవుని రాజ్యములో మొదటి వారి గాను, అతి ప్రాముఖ్యమైన వారిగాను పరిగణింపబడాలని కోరుకొనిన యేసు యొక్క 12 మంది శిష్యులతో ఆయనను పోల్చుకొని చూడుడి. గర్వములేని ఖాళీ హృదయము కలిగిన వానికి యేసు ఒక అత్యున్నతమైన, పరిపూర్ణమైన మాదిరియైయున్నాడు. యేసు ఈ విధముగా పలికెను. "గొప్పవాడెవడు? భోజన పంక్తిని కూర్చుండు వాడా పరిచర్య చేయువాడా? పంక్తిని కూర్చుండువాడే కదా! అయినను నేను మీ మధ్య పరిచర్య చేయువానివలె ఉన్నాను" (లూకా 22:27) యేసు తన చుట్టూ చేరిన అవసరతలలో ఉన్న మనుష్యులకు అనుదినము సహాయము చేసెడివాడు. ఆ ప్రజల కొరకు యేసు ప్రేమ మరియు కనికరముతో నిండియుండెడివాడు. ప్రజలందరు ఒక గొర్రెల కాపరిలేని గొర్రెల వలె ఉన్నారు. వారి జీవితములో ఆయనను మించిన వేరొక అవసరము వారికిలేదని యేసుకు తెలుసు. ఆయన ప్రేమను కృపను ప్రజలు అర్ధము చేసుకొనుటకు యేసు పరలోకమును విడిచి ఈ లోకానికి వచ్చి పాపులకొరకు తన ప్రాణమును అర్పించెను. ఆయనతో ప్రజలు ఒక బంధుత్వములో కొనసాగుటకు ఆయన ఇచ్చే ఆహ్వానమును అంగీకరిస్తామని ఆయన నిరీక్షించుచున్నాడు.

**మన కొరకు యేసు సిలువ మీద మరణము చెందెను. అందుచేత ఏవిధముగా జీవించవలెను? దీనికి జవాబుగా మనకు ఫిలిప్పి 2:3–8 ఏమి చెప్పుచున్నది?**

యేసు సమస్తమును మన కొరకు నెరవేర్చెను. ఆయన మన పాపములను మనము పొందవలసిన శిక్షను అంగీకరించెను. యేసువైపు మనము చూచినపుడు మన హృదయాలు పాపపు మురికితో నిండిపోవుట వలన అవి ఎన్నడూ పవిత్రముగా లేవు. యేసు మనకు చేసిన విషయాలను ఒక్కొక్కటి ధ్యానించినపుడు నేడు ఆయన మనకు ఎంతగానో అవసరమైయున్నాడనే విషయాన్ని గుర్తించకుండా ఉండలేము.

మనము యేసువైపు చూసినపుడు ఇతర విషయాలన్నియు తక్కువ ప్రాధాన్యత కలిగినవిగా కనిపిస్తాయి. యేసు ఎవరు? ఆయన మనకు ఏమి చేసెను? ఆయనకున్న ప్రేమ మన జీవితాలలో ఉన్న అన్ని విషయాలకన్నా మించిన అతి ముఖ్యమైన అంశముగా పరిగణింపబడును. యేసువైపు చూసినపుడు మన స్వార్ధము మన మీద కలిగియున్న స్వాధీనమును కోల్పోవును. యేసు అనే నామము సుందరమైనది బలమైనది. మనము ప్రతి విషయములోను ఏమైయుండాలో అనే దానికి యేసు మనకు మంచి మాదిరియై యుండెను. అన్ని విషయాలలోను యేసును పోలి మనముండాలి. యేసు హృదయములో గర్వము లేదు. మన హృదయమును యేసుకు తెరచినపుడు ఆయన గూర్చి ఎంతో నేర్చుకుంటాము. అదే సమయములో గర్వము పాపముతో నిండియున్నామని గ్రహింపగల్గుదుము. యేసు లేకుండా జీవితాలు సుఖములేని, దిక్కుమాలిన స్థితిలో నుండును. హృదయములో గూడుకట్టుకున్న గర్వమునంతా ఖాళీ చేస్తే యేసుతో మన బాంధవ్యము బలముగా ఎదుగును.

**ఈ క్షణము నుండే యేసుతో సమయము గడుపు. బైబిలును కలమును, పుస్తకము తీసుకొని నిశబ్దముగా ఉన్న చోట కూర్చుని దేవునిని ఆహ్వానించు ఎడ్వంటిస్టు ఇంగ్లీషు కీర్తన 138 చూచి వ్రాయి. అందులో ఏ మాటలు నీకు ప్రత్యేకముగానున్నవి?**

**శుక్రవారం** **ఏప్రిల్ 17**

## అదనపు అధ్యయనము

"మనము యేసు నొద్దకు సమీపించినపుడు ఆయన ప్రేమను స్పష్టముగా చూడగలుగుదుము. ఆయన ప్రేమ పవిత్రమైనది. పాపము చాలా దుర్మార్గమైనది అని కూడా చూడగలము. అంతట మనలను పొగడుకొనుటకు ఇష్టపడము. మనుష్యులు వారి మంచి ప్రవర్తనను గూర్చి పొగడుకొనని వారి యెడల దేవుడు తన అనుగ్రహమును చూపించును. దేవుని దృష్టిలో గర్వములేని హృదయము గలవారు పరిశుద్ధులుగా ఎంచబడుదురు" –ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు పుట 160.

నీవు గౌరవింపబడాలంటే నీ హృదయములో ఉన్న గర్వమునంతటిని తీసివేసుకోవలెను. బాప్తిస్మమిచ్చు యోహాను వంటి పనివారిని దేవుడు ఎన్నిక చేసుకుంటాడు. యోహానుకు తన హృదయములో ఎటువంటి గర్వములేదు. అందుచేత యోహానును దేవుడు తన సేవకుడుగా నియమించుకొనెను. చిన్న పిల్లల వంటి స్వభావముగల స్త్రీ పురుషులు

యేసును వెంబడించిన వారిలో అతి శ్రేష్టులుగా ఎంచబడిరి. వారు దేవుని పరిచర్యలో దివ్యమైన సేవ చేయుదురు. స్వార్థముతో తమను తాము హెచ్చించుకొనని వారితో దూతలు పనిచేయును. అట్టి వారు పరిచారకులుగా అనేకులు ఇతరులను దేవుని రాజ్యము కొరకు రక్షించాలని కోరుకొందురు.

కొంతమంది ప్రజలు వారిని గూర్చి గొప్పగా ప్రచారము చేసుకొందురు. వారు లేకుండా దేవుని ప్రణాళిక విజయవంతముకాదని భావింతురు. అట్టి వారిని దేవుడు విడిచి యోగ్యులైన ఇతరులను పనిచేయుటకు ఎన్నుకొనును.

దేవుని రాజ్యములో భాగముగా చేర్చబడాలని కోరిన యేసు యొక్క అనుచరులకు లేక యేసును వెంబడించే వారికి, వారేమి చేయాలో యేసు బోధించెను. అన్నిటికన్నా మిన్నగా వారికి మార్పు చెందిన హృదయము అవసరమైయుంది. దేవుని రాజ్యమునకు సంబంధించిన ముఖ్య నియమాలకు అనుకూలముగా ప్రవర్తించుటకు నూతన హృదయము వారికి సహాయపడును. దేవుడు చిన్న పిల్లలను ప్రేమించును. వారిలో స్వార్థమును గూర్చిన చింత ఉండదు. వారు దేవుని ప్రేమించి ఆయనయందు నమ్మకముంతురు.

వారి పాపములనిమిత్తమై విచారమును వ్యక్తపరచిన నమ్మకమైన క్రైస్తవులు. దేవుని దృష్టిలో విలువైనవారు. దేవుడు వారిని ఘనపరచును. మనుష్యులు కలిగియున్న ధనధాన్యములను బట్టి, పేరు ప్రతిష్టలను బట్టి దేవుడు వారిని ఘనపరచడు. యేసువలె ప్రవర్తించగలిగే వారిని దేవుడు ఘనపరచును – ఎలెన్ జి వైట్, యుగయుగాల ఆకాంక్ష, పుటలు 436, 437.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మత్తయి 23:12; కీర్తన 25:9; కీర్తన 149:4; యాకోబు 4:6,10 చదువుడి. గర్వమును గూర్చి మన హృదయములలో అది ఏ రూపములోను ఉండకూడదనే విషయమై ఈ వాక్యాలు ఏమి బోధించుచున్నవి?
2. నిన్ను గూర్చి హెచ్చించుకొని చివరగా ఎప్పుడు మాట్లాడియున్నావు? ఆ వైఖరి వలన నీకు దేవునితోను ఇతరులతోను ఉన్న బాంధవ్యములో ఎట్టి మార్పులు చోటుచేసుకున్నవి?
3. దేవునితో నీకున్న బంధుత్వము వృద్ధి చెందాలనుకున్నట్లయితే నీ జీవితములో తప్పనిసరిగా మార్చుకొనవలసిన విషయాలేమిటి? నీ హృదయములో నుండి గర్వమునకు సంబంధించిన తలంపులు, భావములు ఖాళీ చేయాలి.

❄✶❄